



సీఎం చంద్రబాబు జలహారతికోసం హంద్రీ-నీవా కాలువలోకి నిర్మాణమవుతున్న మెట్లు



ఇంక దిగులే లేదు

నేను ఏడు ఎకరాల్లో వరి ఏశాను. బోర్లలో నీళ్లు తక్కువ కావడంతో అంతంతమాత్రం పంట వస్తోంది. హంద్రీ-నీవా కాలువలో నీళ్లు వచ్చి, మా చెరువు నింపతారంట. అదే జరిగితే బోర్లలో నీళ్లు పైకొస్తాయి. ఇంక దిగులే లేదు.

- శ్రీనివాసులు, రైతు, పరమసముద్రం

బిరబిరా.. కృష్ణమ్మ కదలి వచ్చేను!

కుప్పం అన్నదాతలో ముందస్తు జలకళ!

- నేటి రాత్రికి పరమసముద్రం చెరువుకు చేరనున్న హంద్రీ-నీవా జలాలు
- 30న సీఎం చంద్రబాబు జలహారతి
- తీరనున్న సాగు, తాగునీటి బెంగ

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పంకి చేరుకోవడానికి కృష్ణా జలాలు ఉరకలెత్తుతున్నాయి. బహుశా ఆదివారం రాత్రికి కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు చేరవచ్చని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 30న ఈ చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువకు జలహారతి ఇవ్వనున్నారు. కుప్పం అన్నదాతలో ముందస్తు జకలకళ కనిపిస్తోంది. హంద్రీ-నీవా జలాలతో తాగునీటి ఇబ్బంది కూడా తీరనుంది. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద జూలై 17న ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇవి అన్నమయ్య జిల్లా మదనపల్లె దాటుకుని ఈనెల 22వ తేదీనాటికి పుంగనూరు చేరుకున్నాయి. శనివారం నాటికి పలమనేరు నియోకవర్గం వి.కోట మండల పరిధిలోకి వచ్చేశాయి. ప్రస్తుతం కాల్వలో 80 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇదే వేగంతో సాగితే ఆదివారం రాత్రికల్లా కుప్పం మండలంలోకి వస్తాయి.

సాగులోకి 6,300 ఎకరాలు

కుప్పం బ్రాంచి కెనాల పొడవు 123.641 కిలోమీటర్లు. మధ్యలో 330 నిర్మాణాలు ఉన్నాయి. మూడు పంప్ హౌస్‌ల ద్వారా నీటిని పంప్ చేస్తున్నారు. కాలువ పొడవునా 5.350 కిలోమీటర్లు, 39.225 కిలోమీటర్లు, 60.715 కిలోమీటర్ల దూరాలలో ఈ పంప్ హౌస్‌లను నిర్మించారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికి రూ.593.43 కోట్ల వ్యయం చేశారు. ఈ కాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు చెందిన 8 మండలాల పరిధిలోని 110 చెరువుల కింద 6,300 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. అంతేకాక 4.02 లక్షల మందికి తాగునీరు లభిస్తుంది.

పరమసముద్రం వద్ద పైలాన్

సొంత నియోజకవర్గ ప్రజల కలలు సాకారమవుతున్న నేపథ్యంలో ఈనెల 29, 30 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో పర్యటించనున్నారు. పరమసముద్రం చెరువు సమీపంలో హంద్రీ-నీవా కాలువకు జలహారతి ఇచ్చి, సమీపంలోనే బహిరంగ సభలో పాల్గొని నియోజకవర్గ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. పొక్లెయినర్లతో చెరువుకట్ట కింద ఉన్న పొదలను తొలగిస్తున్నారు. కట్టను బలోపేతం చేస్తున్నారు. ఉన్న రెండు కలుజులను సైతం మరమ్మతులు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భానికి గుర్తుగా చెరువు సమీపంలో కాలువ గట్టుపై పైలాన్‌ను సీఎం ఆవిష్కరించన్నారు. ఇక్కడ సుమారు 18 అడుగుల ఎత్తుగల పైలాన్ నిర్మాణం చకచకా సాగుతోంది. మరోవైపు సభావేదిక కోసం భూమిని చదును చేసే పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి.

అన్నదాతలో జలకళ

పరమసముద్రం చెరువు విస్తీర్ణం 110 ఎకరాలు. ఇందులో దాదాపు 20-26 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. అయితే కృష్ణా జలాలతో ఒకసారి చెరువు నిండితే ఈ ఆక్రమణలు వాటికవే తొలగిపోయే అవకాశం ఉంది. పరమసముద్రం చెరువు నిండితే దీనికున్న రెండు కలుజుల ద్వారా ప్రవాహం కిందివైపున గల కుప్పం సమీపంలోని వీరప్పనాయని చెరువు, అక్కడినుంచి మండలంలోని దిగువ చెరువులకు చేరుతాయి. ముందుగా నీటిని పరమసముద్రం చెరువుకు చేర్చి, తర్వాతనే నియోజకవర్గంలోని మిగిలిన చెరువులకు విడుదల చేయనున్నారు. కేవలం పరమసముద్రం చెరువు కిందనే దాదాపు 800 ఎకరాల ఆయకట్టు ఉంది. అంతేకాదు.. నియోజకవర్గం పొడవునా ప్రవహించే కాలువ ద్వారా భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి, ఆమేరకు ఎండిపోయిన బోరుబావులు రీచార్జి అవుతాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో భూగర్భ జలాలు 700-1200 అడుగుల లోతులో ఉన్నాయి. అందువల్ల వందల బోర్లు నిరుపయోగం మారాయి. కృష్ణా జలాల వల్ల వీటిలో ముప్పావు వంతు తిరిగి వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో కుప్పం అన్నదాతలో ఎన్నడూ లేని ఉత్సాహం కనిపిస్తోంది. పరమసముద్రం చెరువు వద్ద తిరుగాడుతున్న కొంతమంది రైతులని పలుకరిస్తే బంగారు భవిష్యత్తు సాకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు.

చెరువు నిండితే పట్టిందల్లా బంగారమే

ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్యాన చెరువు నిండబోతోంది. ఇక మా ఊరోళ్లకే కాదు, పక్క ఊళ్ల వాళ్లకూ పట్టిందల్లా బంగారమే. మట్టినుంచి మాణిక్యాలు పండించుకోవచ్చు. ఈ చెరువు కింద మావూరు, పక్క వూళ్లు కలిసి సుమారుగా 1000 ఎకరాలుండాయి. ఈ భూముల్లో ఏ పంట ఏసినా బంగారంలా పండుతుంది.

- ఎం.చిన్నబ్బయ్య, మాజీ సర్పంచి, పరమసముద్రం





వేగంగా పైలాన్ నిర్మాణ పనులు - హంద్రీ-నీవా కాలువలో జరుగుతున్న పూడికతీత పనులు

వి.కోటకు చేరుకున్న నీళ్లు

అడుగడుగునా గంగమ్మకు జల హారతులు

వి.కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం వి.కోటకు శనివారం హంద్రీ-నీవా జలాలు చేరుకున్నాయి. ఉదయాన్నే బైరెడ్డిపల్లె మండలం నుండి కృష్ణాజలాలు తోటకనుమ మీదుగా గ్రావిటీ ద్వారా నీరు దానమయ్యగారిపల్లె వద్దకు చేరుకున్నాయి. మధ్యాహ్నం కృష్ణాపురం వద్దనున్న పంప్ హౌస్‌కు జలాలు రావడంతో పెద్ద ఎత్తున జనం అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం పంప్ హౌస్‌లో మిషన్లకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, టీడీపీ నేతలు, కూటమి నాయకులు పూజలు చేశారు. పంప్ హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ చేసి నీరు పంపింగ్ చేశారు. కాసేపటికే నీరు రెండు పైపుల నుంచి బయటకు రావడంతో ఒక్కసారిగా రైతులు, పార్టీ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు కృత నిశ్చయంతో 600 కిలోమీటర్లు మేర కాల్వ పూర్తి చేసి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా 700 అడుగుల ఎత్తుకు నీటిని తరలించడం చారిత్రాత్మకం అన్నారు. సాయంత్రానికి వి.కోట - కుప్పం మార్గంలోని దాసార్లపల్లె వద్ద జాతీయ రహదారిని దాటి కృష్ణా జలాలు కుప్పం వైపు పరవళ్లు తొక్కాయి. రాత్రికి పెద్దబరిణేపల్లె పంచాయతీ ఆదినేపల్లె వద్దనున్న మరో పంప్ హౌస్‌కు నీరు చేరుకోనున్నాయి. అక్కడ నీటిని పంప్ చేస్తే కుప్పం సెగ్మెంట్ పరిధిలోని రామకుప్పం మండలంలోకి అడుగెడుతాయి. ఇందుకుగాను హెచ్‌ఎన్ ఎస్‌ఎస్ అధికార బృందం కాల్వ వెంబడి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్ ఈఈ వెంకటేశ్వరావు, సీఈ వరప్రసాద్, డీఈ గోవర్ధన్, రిత్విక్ సంస్థ పీడీ నాగేశ్వర్‌రావు, టెక్నికల్ ఇన్‌చార్జ్ డి.వి.రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు చౌడప్ప, రాంబాబు, విశ్వనాథ్, నారాయణస్వామి, ఈశ్వర్, రామూర్తి పాల్గొన్నారు.





కుప్పం వైపు పరుగెడుతున్న కృష్ణమ్మ (ఇన్‌సెట్లో) పంప్ హౌస్‌లో పూజలు చేస్తున్న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు

వాల్వ్ లీకై ఎగసిపడ్డ నీరు

కావాలనే చేశారా?

వి.కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శనివారం కృష్ణాపురం పంప్ హౌస్ నుంచి పంప్‌చేసిన నీరు సాయంత్రానికి ముదిమడుగు చెరువుకు చేరుకున్నాయి. చాలా రోజుల క్రితం ఈ కాల్వపై గ్రావిటీ కోసం అమర్చిన వాల్వ్ లీకవ్వడంతో ఎగసి పడి చెరువుదారి పట్టాయి. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు అక్కడకు చేరుకుని అతి కష్టం మీద వాల్వ్ లీకేజీని అరికట్టారు. దీంతో కాల్వలో జలాలు దాసార్లపల్లె వద్ద రోడ్డుదాటి ఆదినేపల్లె లిఫ్ట్‌హౌస్ పాయింట్ 54 కిలోమీటరు వద్దకు సాగాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వాల్వ్ పైకప్పును తీసేయడంతో లీకేజీ జరిగిందని, దానిని తక్షణం సరిచేసినట్లు అధికారులు తెలిపారు.



వాల్వ్ లీకేజీని అరికట్టిన అధికారులు

డ్రా నిర్వహించని బార్ల దరఖాస్తు రుసుం తిరిగి చెల్లింపు

చిత్తూరు సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డ్రా నిర్వహించని బార్ల దరఖాస్తు రుసుం తిరిగి చెల్లించనున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో బార్‌కు రూ.5.10 లక్షలు తిరిగిరాని దరఖాస్తు రుసుంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక బార్‌కు నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే దానికి డ్రా నిర్వహించరు. అలాంటి సమయంలో దరఖాస్తు రుసుం తిరిగి చెల్లిస్తామని ఈఎస్ పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చేయాలి

డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చేయాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. ఈ అంశంపై శనివారం స్థానిక అపోలో కళాశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలోని డీవైఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో పాటు రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ.. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో బృందంలో ఉండే సభ్యులు.. ప్రతి పత్రాన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఏ సందేహం వచ్చినా.. పైఅధికారుల నుంచి వివరణ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, ఎస్ఎస్ చిత్తూరు, తిరుపతి ఏపీసీలు వెంకటరమణ, గౌరీశంకర్, డీవైఈవో ఇందిర, బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానీ బాషా, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైనవారికి రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైనవారు సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయానికి ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని సూచించారు. దరఖాస్తు సమయంలో జత చేసిన ధ్రువపత్రాల ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారి సంతకం చేసిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలన్నారు.

దంచేసిన వాన



పాల సముద్రంలోని నరసింహాపురం వద్ద దెబ్బతిన్న కల్వర్టు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా ఐదు మండలాల మినహా మిగిలిన 27 మండలాల్లో గడిచిన 24 గంటల్లో వర్షం దంచేసింది. పాలసముద్రంలో అత్యధికంగా 95.2 మి.మీ, అత్యల్పంగా సదుంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. గుడిపాలలో 89.2, యాదమరిలో 87.4, గంగవరంలో 83.2, గుడుపల్లెలో 68.4, శాంతిపురంలో 54.6, కుప్పంలో 54, వి.కోటలో 50.6, చిత్తూరు రూరల్‌లో 43, బైరెడ్డిపల్లెలో 41.8, నగరిలో 41.2, విజయపురంలో 40.2, చిత్తూరు అర్బన్‌లో 35.6, బంగారుపాళ్యంలో 35, నింద్రలో 31.4, రామకుప్పంలో 30.8, వెదురుకుప్పంలో 28.2, పలమనేరులో 25.8, పెద్దపంజాణిలో 25.4, పెనుమూరులో 20.2, కార్వేటినగరంలో 19.4, గంగాధరనెల్లూరులో 17, పూతలపట్టులో 16.4, శ్రీరంగరాజపురంలో 15.2, తవణంపల్లెలో 12.8, సోమలలో 4.8 మి.మీ వర్షం కురిసింది.

ఇసుక లారీ సీజ్: ఇద్దరిపై కేసు నమోదు

గుడిపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి తమిళనాడుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్‌పేట ఇసుక రీచ్ నుంచి తమిళనాడుకు లారీ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న యజమాని శేఖర్, డ్రైవర్ శరవణను అరెస్టు చేసి.. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

29, 30 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన

యూరియా దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎస్సీ బాలికల హాస్టల్లో గ్యాస్ లీకై చెలరేగిన మంటలు
5లో

టీడీపీ 'అధ్యక్ష' పదవికి భారీ పోటీ

- రేపు చిత్తూరు రానున్న త్రిసభ్య కమిటీ
- ఎమ్మెల్యేలు, చైర్మన్ల నుంచి అభిప్రాయాల సేకరణ
- తీవ్ర ప్రయత్నాల్లో ఆశావహులు

చిత్తూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్ష పదవికి భారీ పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోస్టుతోపాటు కార్యవర్గాన్ని ఎంపిక చేయడానికి త్రీమెన్ కమిటీని నియమించింది. ఇందులో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి (నంద్యాల), గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (గుంటూరు), లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు (గుంటూరు) ఉన్నారు. వీరు సోమవారం చిత్తూరుకు వచ్చి.. ఎమ్మెల్యే, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. శనివారం సాయంత్రం సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల త్రీమెన్ కమిటీ నాయకులతో ఉండవల్లిలోకి క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎంపిక ఎలా అన్నదానిపై సూచనలిచ్చారు. ఈ సమాచారం జిల్లాలోని ఎమ్మెల్యేలతోపాటు వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్లు సీఆర్ రాజన్, త్యాగరాజన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలతకు సమాచారం అందింది.

పోటీ ఇలా.. : ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన సీఆర్ రాజన్‌ను చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. అంతకుముందు పులివర్తి నాని అధ్యక్షుడిగా ఉండేవారు. ప్రధాన కార్యదర్శిగా బంగారుపాళ్యానికి చెందిన కోదండయాదవ్

మిగతా 5వ పేజీలో..

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ సంజయ్ కరోల్

తిరుమల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

సూర్యఘర్ లబ్ధిదారులను ప్రోత్సహించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారిని ప్రోత్సహించాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. సదరన్ డిస్కం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం డిస్కంలోని 9 జిల్లాల రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం వల్ల సంస్థపై విద్యుత్ కొనుగోలు భారం తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకం వినియోగదారుల సర్వీసులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ వినియోగదారులకు ఉపయోగపడుతోందని, సంస్థకు విద్యుత్ చౌకగా లభిస్తోందని తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ బకాయిలు 100 శాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అంతకు ముందు సంస్థ రెవెన్యూ విభాగం చీఫ్ జనరల్ మేనేజరు కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని విద్యుత్ రెవెన్యూ వసూలు అంశాలపై సమీక్ష చేశారు. 9 జిల్లాల ఎస్ఏవోలు, ఏవోలు, ఏఏవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,067

తలనీలాలు సమర్పించినవారు: 25,212

ఆదివారం ప్రత్యేకం

వైకల్యాన్ని ఓడించాడు

ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్

క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం

కొందరు చిన్న కష్టం ఎదురైతేనే నిరాశ చెందుతారు. జీవితాన్నే కోల్పోయినట్లు భావిస్తారు. కానీ అన్వేష్ అలా కాదు. ప్రమాదవశాత్తూ ఒక చెయ్యి పోయినా ఆత్మవిశ్వాసాన్ని వీడలేదు. వైకల్యంగా భావించలేదు. తనలోని క్రీడా సంకల్పాన్ని చెక్కు చెదరనివ్వలేదు. ఒంటిచేత్తోనే బతుకుబండి నడుపుతున్నాడు. మరోపక్క తాను ప్రాణానికి ప్రాణంగా భావించే క్రీడల్లోనూ రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు. నిరంతర సాధనతో సాధ్యం కానిదేదీ లేదంటూ నిరూపిస్తూ స్ఫూర్తిని చాటుతున్నాడు అన్వేష్.

- గూడూరు, ఆంధ్రజ్యోతి





గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టకు చెందిన మరియమ్మ, కృష్ణయ్య దంపతుల కుమారుడు అన్వేష్ పురుషోత్తమ్. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ నేపథ్యం. చదువుతో పాటు క్రీడలంటే కూడా ఇష్టం. వాకాడు గురుకుల పాఠశాలలో చదువుతున్నప్పుడు సాఫ్ట్‌బాల్, రెజ్లింగ్, షాట్‌పుట్, వాలీబాల్‌లలో శిక్షణ పొందాడు. విశేష ప్రతిభ కనబరిచాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచాడు. నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివాక గూడూరులోని ఓ పరిశ్రమలో చిరుద్యోగంలో చేరాడు. 2011లో పెళ్లయిన అన్వేష్‌కు పాప, బాబు ఉన్నారు. 2014లో దురదృష్టం వెంటాడింది. పరిశ్రమలో జరిగిన ఓ సంఘటన అన్వేష్‌ను అంగవికలుడ్ని చేసింది. కుడి చేయిని కోల్పోయాడు. రెండేళ్లపాటు ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. కొద్దిగా కోలుకున్నాక మనసు మళ్లీ క్రీడలమీదకు మళ్లింది. ఇందుకోసం ఒంటిచేతితోనే కఠోర సాధన చేశాడు. క్రీడా నైపుణ్యానికి పదునుపెట్టాడు. షటిల్, షాట్‌పుట్, క్రికెట్ వంటి క్రీడలతో పాటు పలు అథ్లెటిక్స్ ఆడటంలో సఫలీకృతుడయ్యాడు. నైరాశ్యాన్ని తరిమేసి దివ్యాంగుల క్రీడాపోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. జాతీయ స్థాయిలో పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అంతర్జాతీయ పారా క్రికెట్ క్రీడల పోటీల్లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాడు.


బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీలలో ప్రతిభాపురస్కారాన్ని అందుకుంటున్న అన్వేష్

సాధించిన విజయాల్లో కొన్ని..

● 2020లో విశాఖపట్నం 2021లో అనంతపురం, 2022లో కాకినాడ, 2023లో విశాఖట్నంలలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించాడు. 2021లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ● 2023లో భారత్-బంగ్లాదేశ్ టీ-20 పోటీల్లో జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ బోర్డులో సభ్యత్వం సాధించాడు. అదేఏడాది బెంగళూరు అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలను గెల్చుకున్నాడు. కోయంబత్తూరు ఐపీసీయల్ క్రికెట్ పోటీల్లో జట్టు విజయానికి దోహదపడ్డాడు. నేపాల్‌తో జరిగిన టీ-20, వన్‌డే సిరీస్‌ల్లో భారత్ విజయం వెనుక బలమైన పాత్ర పోషించాడు. అన్వేష్ సాధించిన క్రీడా విజయాలకు ప్రోత్సాహకరంగా పలు పురస్కారాలను అందుకున్నాడు.

చేయూత ఇవ్వండి..

పోటీలకు వెళ్లాలని ఉత్సాహమున్నా ఆర్థిక స్తోమత ప్రతిబంధకమవుతోంది. సొంతంగా నిధులు సమకూర్చుకోవడం కష్టంగా ఉంటోంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చు చాలానే అవుతుంది. దాతలు లేదా ప్రభుత్వం కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని విజయాలను సాధిస్తా.

- అన్వేష్ పురుషోత్తమ్

‘మఠం’ భవనాన్ని పూర్తిగా కూల్చం

● దెబ్బతిన్న చోటే పునర్నిర్మాణం ● ఐఐటీ నివేదికను అనుసరిస్తాం ● మరోసారి సమావేశమై తుదినిర్ణయం ● భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్


మఠం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హాథిరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చబోమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. కుంగిన, పగుళ్లు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే కూల్చడమా? లేదా రెట్రోఫిటింగ్ రీకన్‌స్ట్రక్షన్ చేయడమా? అనేది మరో నాలుగురోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఐటీ నివేదిక ఆధారంగా ప్రజలకు ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుపతి గాంధీరోడ్డులోని హాథిరాంజీ మఠం భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘హాథిరాంజీ మఠానికి 125ఏళ్ల చరిత్ర ఉంది. కాలక్రమంలో ఇక్కడ దేవదాయశాఖ అర్జేసీ కార్యాలయం, మఠం పరిపాలన, సుమారు 60 షాపులకుపైగా అద్దెకు ఇచ్చారు. నిర్వహణ సరిగాలేక భవనం శిథిలావస్థకు చేరింది. ఏడేళ్లుగా కార్పొరేషన్‌కు తరచూ ఫిర్యాదులు వచ్చాయి. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే ప్రాణనష్టం కలిగే అవకాశం ఉండటంత మఠం వాళ్లు దేవదాయశాఖకు లేఖ రాశారు. ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారు. పగుళ్లు, కుంగిపోయిన ప్రదేశాలను చూసి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు నివేదకలో స్పష్టంగా తెల్చారు. హాథిరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామన్నది అపోహమాత్రమే. మఠానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల పగుళ్లు, కుంగిపోవడం వల్ల భవనం శిధిలావస్థకు చేరింది. ఎవరికీ ప్రాణం నష్టం జరగకూడదనేదే ప్రభుత్వం ఉద్దేశం. ఈ మఠం బంజారా కమిటీకి సెంటిమెంటుతో కూడినదని వారి మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉండదు’ అని తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా.ఇక్కడి వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ పరిస్థితులను పరిశీలించామన్నారు.భవనాన్ని పూర్తిగా కూల్చి వేస్తామని మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. ఐఐటీ నిపుణుల నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, మఠం ఏవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ యూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర కూటమినేతలు బీఎల్ సంజయ్, మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, ఆముదాల తులసీరాం, రాజా రెడ్డి, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మఠం భవనం కూల్చొద్దు

● హథీరాంజీ మఠంలో బంజారా సాధువులు, భక్తుల నిరసన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాన్ని కూల్చొద్దంటూ బంజారా మహంతు, హథీరామ్ బాబాజీ మహాసంఘ్ సభ్యులు శనివారం నిరసనకు దిగారు. మఠం భవనాల పరిశీలనకు ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారనే సమచారంతో వీరంతా ఇక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్వరస్వామి పరమభక్తుడు హథీరాంజీ జ్ఞాపకాలకు గుర్తు ఈ మఠం భవనమని పేర్కొన్నారు. పురాతన ఈ కట్టడాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరారు. కూల్చాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ సంఘ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. మఠం జ్ఞాపకాలను చెరపడం లేదని, అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి నష్టం కలగకూడదనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

స్విమ్స్ వర్సిటీ పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబరు 5 వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ, ఎంఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్సెస్, ఎంఎస్సీ క్లినికల్ వైరాలజీ, ఎంఎస్సీ క్లినికల్ సైకాలజీ వంటి పీజీ కోర్సులతోపాటు స్పెషలైజేడ్ నర్సింగ్ కోర్సులకు ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

నేడు ఏపీపీఎస్సీ డిపార్టుమెంటల్ పరీక్ష

- హాజరు కానున్న 1,450 మంది అభ్యర్థులు -


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ కంప్యూటర్ డిపార్ట్‌మెంటల్ పరీక్ష(గ్రామ సర్వేయర్ల)కు ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని, 1,450మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. మొత్తం మూడు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, జగదీష్, యోగేష్ పాల్గొన్నారు.

కర్ణాటక జంట ఆత్మహత్య


వెంకటరాజు, అనుష మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం వడ్డగిరికి చెందిన జంట తిరుపతిలోని ఒక లాడ్జిలో శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. వడ్డగిరికి చెందిన వెంకటరాజు(34), అనుష(25) ఇంటి నుంచి పారిపోయి శుక్రవారం తిరుపతికి వచ్చారు. శ్రీవారి దర్శనానికి వచ్చినట్లు చెప్పి స్థానిక శివకృష్ణ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులుగా వారు బయటకు రాక పోవడంతో అనుమానం వచ్చి గది తాళాలు పగలకొట్టి చూశారు. ఇద్దరూ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించారు. వెంటనే లాడ్జి మేనేజర్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియలేదని, బెంగళూరులోని చామరాజుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ అరగంటలోనే నగలు ఎత్తుకెళ్లారు

● 80 గ్రాముల ఆభరణాల చోరీపై కేసు నమోదు


చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లోని టీవీ వెనుక కప్‌బోర్డులో 80 గ్రాముల బంగారు నగలు ఉంచారు. 20వ తేది చూస్తే ఉన్నాయి. శుక్రవారం ఉదయం చూస్తే లేవు. 20వ తేదీన మధ్యాహ్నం షాపునకు వెళ్లొచ్చిన అరగంట వ్యవధిలోనే దొంగతనం చేసుంటారని భావించారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. దుర్గసముద్రంలో పత్తి మునెమ్మ, రామచంద్రయ్య దంపతులు ఉంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు రామచంద్రయ్య తన అక్క ఇంటికి వెళ్లారు. 3.30 గంటల సమయంలో మునెమ్మ ఆకు వక్క తీసుకురావడానికి ఇంటికి తాళమేసి, తలుపు పక్కన బ్యాగులో ఆ తాళాలు ఉంచి వెళ్లారు. అరగంట తర్వాత ఆమె తిరిగొచ్చారు. తలుపునకు తాళం వేసుండటంతో ఎలాంటి అనుమానం రాలేదు. శుక్రవారం ఉదయం చూడగా టీవీ వెనుక ఉంచిన దాదాపు 80 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇళ్లంతా వెదికారు. ఎక్కడా కనిపించక పోవడంతో శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందును కలసి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షేక్ షావలి, పోలీసులు, డాగ్, వేలి ముద్రలు నిపుణులు పరిశీలించారు. ఇప్పటికే అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులకు కేసులో కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

● 577 యూరియా బస్తాల సీజ్



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్స్ దాడులు చేపట్టారు. రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్న వైనంపై తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు డీఎస్పీ మల్లికార్జునరావు నేతృత్వంలో సీఐలు వెంకటరవి, చంద్రశేఖర నాయక్, విజిలెన్స్ ఏవో రామాంజనేయులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. గూడూరులో సాయి బాలాజీ రైతు డిపోలో 577 యూరియా బస్తాలు సీజ్ చేశారు.

తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీకి కసరత్తు

● 26న రేణిగుంట వై కన్వెన్షన్ హాలులో సమావేశం

● పరిశీలకులుగా మంత్రి సవిత సహా ఇద్దరు కార్పొరేషన్ల ఛైర్మన్లు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు కసరత్తు ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీన మంగళవారం తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. పార్లమెంటు కమిటీ ఏర్పాటుపై చర్చించి, సమావేశం సజావుగా జరిగేలా చూసేందుకు అధిష్ఠానం ముగ్గురు పరిశీలకులను నియమించింది. ఆ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు. 26న రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాలులో ఉదయం 10 నుంచీ సాయంత్రం 5 వరకూ సమావేశం జరగనుంది. దీనికి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొదలుకుని జాతీయ, రాష్ట్ర కమిటీలలోని ప్రతినిధులు, రాష్ట్ర అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రస్తుత జిల్లా కమిటీ, జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల్లో వున్న వారు... ఇలా సుమారు 200 మంది దాకా ప్రతినిధులు హాజరు కానున్నారు. పరిశీలకుల ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పార్లమెంటు కమిటీలోని 34 పదవులకు, అలాగే రాష్ట్ర కమిటీకి ఆయా నియోజకవర్గాల నుంచీ ఆశావహుల జాబితాలను ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు పార్టీ పరిశీలకులకు అందజేయనున్నారు. ముఖ్యంగా పార్లమెంటు కమిటీకి సంబంధించి ప్రధాన సామాజికవర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు తగిన ప్రాతినిధ్యం వుండేలా, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకూ ప్రాతినిధ్యం వుండేలా జాగ్రత్త వహించనున్నారు. పార్లమెంటు, రాష్ట్ర కమిటీలలో వివిధ పదవులను ఆశిస్తున్న వారి జాబితాలను, ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు సిఫారసు చేసిన జాబితాలను పరిశీలకులు అదే రోజు సాయంత్రం అధిష్ఠానానికి పంపించనున్నారు. ఈ నెలాఖరులోపే పార్లమెంటు కమిటీని అధిష్ఠానం ప్రకటించే అవకాశముంది.

నేటి నుంచి అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు

● మైదానాల్లో విస్తృత ఏర్పాట్లు


ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్‌కు సిద్ధమైన ట్రాక్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే పోటీల ఏర్పాట్లను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, ఎస్వీయూ క్యాంపస్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్‌స్కూల్ వద్ద వాలీబాల్, ఆర్చరీ, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఎస్వీఆర్ట్స్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరుగుతాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అధికారులు మొత్తం 1,700మంది ఆదివారం ఉదయానికి చేరుకుంటారు. ఎస్వీయూ, మహిళా వర్సిటీలలో వసతుల కు సంబంధిచి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎస్వీయూ మైదానంలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రవాణా, క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ు హాజరుకానున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

● విద్యార్థులు సురక్షితం


పొలంలోకి దూసుకెళ్లిన దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లె సమీపంలో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ విద్యార్థులెవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షేమంగా బయటపడ్డారు. శనివారం ఉదయం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు పుల్లయ్యగారిపల్లె నుంచి చంద్రగిరికి వస్తోంది. దారిలో ఆటో ఎదురుగా రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

యూరియా దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత నేపథ్యంలో తిరుపతి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాలతో అధికారులు శనివారం జిల్లా కేంద్రంలోని జ్యోతి ట్రేడర్స్‌తోపాటు పలు ఎరువులు, యూరియా దుకాణాల్లో తనిఖీలు చేశారు. స్టాక్ వివరాలు పరిశీలించారు. ఎక్కడైనా యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌లో గ్యాస్ లీకై చెలరేగిన మంటలు


సిలిండర్ నుంచి వెలువడుతున్న మంటలు

గుడిపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గుడిపాల ఎస్సీ బాలికల హాస్టల్‌లో శనివారం సాయంత్రం వంట గదిలో గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో వంట మనుషులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానిక హైవే పోలీసులు విషయం తెలుసుకుని మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

దండికుప్పంలో పంటలపై ఏనుగుల దాడులు

వి.కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం తోటకనుమ పంచాయతీ దండికుప్పంలో ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి పంటలను ధ్వంసం చేసింది. అర్ధరాత్రి పది ఏనుగుల గుంపు బనగానికుంట మీదుగా గ్రామశివార్లలోని పంటపొలాల్లోకి చేరుకున్నాయి. రైతులు ఆనందప్ప, వినోద్, వజీర్‌సాహెబ్, పండువేల్, సుబ్రహ్మణ్యం, అమల తదితరులకు చెందిన వరి పొలంలోకి చొరబడి పైరును తిని, తొక్కి, తీవ్రంగా నష్టపరిచాయి. ఏడాదిగా ఇటువైపు రాని ఏనుగులు మళ్లీ రావడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పంటనష్టాన్ని అంచనావేసి.. నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

కనువిందుగా కైగల్ జలపాతం




బైరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వచ్చిన నీటితో కైగల్ జలపాతం కనువిందు చేస్తోంది. ఎంతోకాలంగా బోసిపోయి ఉండిన ఈ జలపాతం వద్ద నీటి ప్రవాహం కనిపించడంతో పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఖజానా ఉద్యోగులు సమయపాలన పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖజానా, ఉపఖజానా కార్యాలయాల విధులకు ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రోజూ ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఫేస్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్)లో కచ్చితంగా నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పలు జిల్లాల్లో కొంతమంది ఖజానా ఉద్యోగులు విధులకు ఇష్టానుసారం వస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొన్నిచోట్ల రోజుల తరబడి ఉద్యోగులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

పులిగుండు వద్ద షూటింగ్ సందడి



పెనుమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద శనివారం సందడి నెలకొంది. తమిళనాడు చెన్నైకి చెందిన సినిమా బృందం పులిగుండు వద్ద నెట్‌ఫ్లిక్స్ సిరీస్ కోసం సినిమా సెట్లు వేసి షూటింగ్ నిర్వహించారు. పులిగుండు మధ్యలో ఉన్న పేటుపైనుంచి కిందకు రోప్ ఏర్పాటుచేసి షూటింగ్ నిర్వహించడాన్ని చూడటానికి చుట్టుపక్కల ప్రజలు ఎగబడ్డారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ లక్ష్మణరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు కాణిపాక వరసిద్ధుడిని శనివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. జిల్లా జడ్జి అరుణసారిక, ఆలయ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'టంగుటూరి'కి ఘన నివాళి


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటం వద్ద ఎస్పీ మణికంఠతోపాటు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎంటీవో చంద్రశేఖర్, ఏవో నాగభూషణమ్మ, డీసీఆర్‌బీ ఎస్ఐ పద్మ, సిబ్బంది ఘన నివాళి అర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు.

మెగా డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు

మెగా డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలోని పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒక అభ్యర్థి మూడు ఉద్యోగాలకు ఎంపికైతే, మరో అభ్యర్థిని పిల్లలు, కుటుంబాన్ని వదిలి మరీ కోచింగ్ తీసుకుని ఉద్యోగాన్ని సాధించారు. ఒక ఊరి నుంచైతే ఏకంగా ఏడుగురు అయ్యోర్లయ్యారు.

పట్టువదలని విక్రమార్కులు


ప్రకాష్ - సుజాత

పెనుమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని ఉప్పిలిపల్లి దళితవాడకు చెందిన ప్రకాష్ 2005 నుంచి డీఎస్సీ పరీక్షలు రాస్తున్నాడు. ఈ దఫా ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఎస్ఏ తెలుగులో 80.70 మార్కులు సాధించి జిల్లాలో 7వ స్థానం, పీజీటీలో 77.5 మార్కులు సాధించి 17వ ర్యాంకు, టీజీటీలో 71.30 మార్కులు సాధించాడు. రెండు దశాబ్దాల కష్టానికి ఫలితం దక్కిందని ప్రకాష్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అలాగే కత్తిరెడ్డిపల్లికి చెందిన సుజాత ఎస్ఏ తెలుగులో 85.29 మార్కులతో ఓసీ కేటగిరిలో జిల్లా మొదటిర్యాంకు, టీజీటీలో 76.86 మార్కులతో 16వ ర్యాంకు, పీజీటీలో 78 మార్కులతో 21వ ర్యాంకులో నిలిచింది. నాలుగేళ్లుగా పిల్లలు, కుటుంబాన్ని వదిలి నంద్యాలలో కోచింగ్ తీసుకున్నందుకు ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేసింది. కనికాపురం గ్రామానికి చెందిన దేవేంద్ర ఎస్ఏ మ్యాథ్స్‌లో జిల్లాలో 5వ స్థానంలో నిలిచాడు.

మారుమూల గ్రామం నుంచి..



యాదమరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని మారుమూల గ్రామమైన కె.గొల్లపల్లెకు చెందిన సుబ్బ మందడి కుమారుడు దేవరాజులు 81.19 మార్కులతో (ఎస్ఏ) గణితంలో జిల్లాస్థాయిలో 10వ ర్యాంకు సాధించాడు.

గ్రామ సచివాలయ ఉద్యోగికి మూడు పోస్టులు



వెదురుకుప్పం మండలం మారేపల్లెకు చెందిన వి.కళ్యాణి ప్రస్తుతం తిరుపతి జిల్లా జీవకోనలో గ్రామ సచివాలయంలో ఉద్యోగి. ఈమె స్కూల్ అసిస్టెంటు బయాలజీలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. జోన్-4లో నాల్గవ ర్యాంకుతో బయాలజీ టీజీటీకి ఎంపికైంది. అలాగే బయాలజీ పీజీటీలో జోన్-4లో 8వ ర్యాంకు సాధించింది. ఈమె తల్లిదండ్రులు వి.రఘు, వి.రాజమ్మలు రజక వృత్తిని చేసుకుంటూ చదివించినట్లు తెలిపారు.


భాగ్య - శిరీష - నవీన్

పాదిరికుప్పంలో ఏడుగురు అయ్యోర్లయ్యారు


గీత - తిరుమలేశం

వెదురుకుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం పాదిరికుప్పం నుంచి ఏకంగా ఏడుగురు అయ్యోర్లయ్యారు. పి.తిరుమలేశం స్కూల్ అసిస్టెంటు (మేథ్స్), ఎస్జీటీగా కూడా ఎంపికయ్యారు. ఎ.గీత స్కూల్ అసిస్టెంటు(సోషియల్), ఎం.శిరీష ఎస్జీటీగా, కె.భాగ్యశ్రీ ఎస్జీటీగా, ఎ.స్వాతి ఎస్జీటీగా, రోజా ఎస్జీటీగా, నవీన్ ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఇక్కడంతా ఎస్సీ సామాజిక వర్గీయులే కావడంతో ఆకుటుంబాలతోపాటు ఊరిలోనూ ఆనందం నెలకొంది.

కానిస్టేబుల్, టీచరు ఉద్యోగాలకు ఎంపిక


సోమశేఖర్

కార్వేటినగరం మండలం శ్రీదేవి, శ్రీనివాసులు దంపతుల మనవడు సోమశేఖర్. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆ ఉద్యోగంలో చేరకముందుగానే డీఎస్సీ ఫలితాలు వచ్చాయి. ఇందులోనూ ఎస్జీటీగా ఎంపికై జిల్లాలో 58వ ర్యాంకు సాధించారు.

టీచరైన రైతు బిడ్డ



పెద్దపంజాణి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేటకు చెందిన రైతు మరెప్పగారి శంకరప్ప కుమార్తె లావణ్య స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో 5వ ర్యాంకు, టీజీటీలో రాష్ట్రంలో ఆరో ర్యాంకు సాధించారు.

కుప్పం యువతికి 22వ ర్యాంకు



కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణానికి చెందిన బి.కళావతి 22వ ర్యాంకు సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. జిల్లాలో మెరిట్‌కు సంబంధించి కళావతి నాల్గవ వ్యక్తిగా నిలిచినట్లు పేర్కొన్నారు.


పాతపాళ్యం దళితవాడ వద్ద మొరవ పారుతున్న చెరువు

మొరవ పారుతున్న చెరువులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం పరిసరాల్లో శుక్రవారం రాత్రి సుమారు నాలుగు పదున్ల వర్షం కురిసిందని స్థానికులు తెలిపారు. దీంతో తూగుండ్రం, కొత్తవెంకటాపురం, బొజ్జనాయనపల్లె దళితవాడ చెరువులు మొరవ పారుతున్నాయి.

పాలసముద్రంలో భారీ వర్షం

పాలసముద్రం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో శనివారం వేకువ జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. తిరుమలరాజుపురం నుంచి కోదండరామాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో నరసింహాపురం వద్ద ఉన్న కల్వర్టు వర్షపు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బలిజకండ్రిగ నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో మహదేవపురం వద్ద కల్వర్టుపై భారీ ఎత్తున వర్షపునీరు ప్రవహించడంతో ఈ మార్గంలో నడిచే బస్సులు ఉదయం ఎనిమిది గంటల వరకు ఇరువైపులా నిలిచిపోయాయి.

29, 30 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన

30న హంద్రీ-నీవాకు జలహారతి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీడీ తదితరులు

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 29, 30 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్సీ, కడా రాజకీయ సలహా మండలి చైర్మన్ కంచర్ల శ్రీకాంత్, పీడీ వికాస్ మర్మత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం తెలిపారు.పరమసముద్రంచెరువు వద్ద హంద్రీ-నీవా కాలువకు కృష్ణాజలాల విడుదల సందర్భంగా అదేప్రాంతంలో జలహారతి ఇస్తారన్నారు. స్థానిక మండల సచివాలయంలోని సమావేశపు గదిలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఈనెల 29వ తేదీ సాయంత్రం కుప్ప చేరుకుంటారన్నారు. 30వ తేదీన ఆయన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి సతీసమేతంగా కృష్ణా జలాలకు హారతి ఇస్తారన్నారు. ఆ సమీపంలోనే పైలాన్ ఆవిష్కరిస్తారని చెప్పారు. అక్కడికి కొద్దిదూరంలో గల పరమసముద్రం చెరువుకు చేరే జలాలను సందర్శించి, సమీపంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. వైసీపీ హయాంలో మాజీ సీఎం జగన్‌రెడ్డి కాలువకు నీటిని విడుదల చేసినట్లు డ్రామాలు ఆడి కుప్పం ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా హంద్రీ-నీవా కాలువ పనులను పూర్తి చేయించారన్నారు. ఆర్థిక కష్టనష్టాల్లో ఉన్నా కోట్లాది రూపాయలు విడుదల చేసి పనులు జరిపించారని చెప్పారు. నిర్దిష్ట గడువుకంటే ముందుగానే కృష్ణాజలాలు కుప్పానికి పరుగులు పెడుతూ వస్తున్నాయన్నారు. సొంత నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చుకుంటున్నారని తెలిపారు. అలాగే కుప్పం పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు తిరిగే టూరిజం బస్సును కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. కుప్పంలోని టూరిజం హోటల్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.47కోట్లు విడుదల చేసిందని, త్వరలోనే పున్నమి రిసార్ట్ ప్రారంభమవుతుందని వివరించారు. చంద్రబాబు తన పర్యటనలో భాగంగా కడా ద్వారా ప్రతిపాదిత విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేయబోయే ర్యాకెట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఫర్నిచర్ తయారీకి సంబంధించిన పరిశ్రమల కంపెనీలతో పాటు చెత్త నిర్వహణకు ఉద్దేశించిన ఐటీసీ సంస్థతో సైతం కడా తరఫున ఒప్పందాలు కుదుర్చుకుంటారన్నారు. ఇప్పటికే ఎంవోయూలు కుదుర్చుకున్న 5 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలతోపాటు ప్రస్తుత మూడు కంపెనీలు కలిపి మొత్తం 8 కంపెనీల ద్వారా కుప్పం నియోకవర్గంలో రూ.4వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. కుప్పంలోని ప్రధాన రహదారి నేతాజీ రోడ్డును 68 అడుగులకు విస్తరించే పనులు సెప్టెంబరు నెలనుంచి ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం సేకరించనున్న ప్రైవేటు భూములకు చదరపు అడుగుకు రూ.6వేలను పరిహారంగా చెల్లిస్తామన్నారు. కోర్టు కేసులను త్వరలోనే పరిష్కరించి రోడ్డు విస్తరణ పనులు కచ్చితంగా ప్రారంభించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, సభ్యురాలు సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డ ఆత్మహత్యపై అనుమానాలు

నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితుల డిమాండ్


పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు, నాయకుల నిరసన - ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న గుణశేఖర్, పురుషోత్తం

వెదురుకుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 'మా బిడ్డ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయి. విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలి' అని బాధితులు డిమాండ్ చేశారు. మృతురాలి తమ్ముడు ఎస్.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లెకి చెందిన హేమలత(29)ను కార్వేటినగరం మండలం జాండ్లపేటకు చెందిన కె.నరేష్ మాయమాటలు చెప్పి ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయినా కట్నకానుకల కింద రూ.3లక్షలు, రూ.2లక్షల విలువైన దుస్తులు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకుని కూడా వేధింపులు మొదలుపెట్టారు. వాటిని తట్టుకోలేక ఈ ఏడాది మే ఒకటో తేదీన కొండకిందపల్లె సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో వెదురుకుప్పం భారతంమిట్ట నుంచి చంద్రశేఖర్ తన కుటుంబీకులు, టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ర్యాలీగా వెదురుకుప్పం పోలీసుస్టేషన్ వద్దకు వచ్చారు. అక్కడ నిరసన తెలిపి.. ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు మరోసారి ఫిర్యాదు చేశారు. ఆత్మహత్యపై విచారించి ఈనెల 27వ తేదీలోపు నిందితులపై చర్యలు తీసుకోకుంటే 28వ తేదీ నుంచి పోలీసుస్టేషన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు బాధితులతో కలసి కూర్చొంటామని నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాతాల గుణశేఖర్ యాదవ్, పి.మోహన్‌మురళి, మనోహర్‌నాయుడు, చంద్రబాబురెడ్డి, మహేష్, చంద్రశేఖర్, బీఎం రవి, రాజవేలు, బోడిరెడ్డి సుధాకరరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, జనసేన నాయకులు పురుషోత్తం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 'అధ్యక్ష' పదవికి భారీ పోటీ

(3వ పేజీ తరువాయి)

కొనసాగుతున్నారు. పార్లమెంటు కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న నేపథ్యంలో అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా పోటీ నెలకొంది. వీరిలో కమ్మ సామాజిక వర్గానికి చెందినవారే అధికంగా ఉండడం విశేషం.

● పాలసముద్రం మండలానికి చెందిన భీమినేని చిట్టిబాబు గతంలో జీడీనెల్లూరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పనిచేసి ప్రస్తుతం రాజంపేట అసెంబ్లీ పరిశీలకుడిగా ఉన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న ఇతను రాజంపేట అసెంబ్లీలోని ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలో కీలకపాత్ర పోషించి, గెలిచిన జడ్పీటీసీతో సీఎం చంద్రబాబును కలిశారు. ఈయన అధ్యక్ష పదవి తనకే అన్న నమ్మకంలో ఉన్నారు.

● చిత్తూరులోని భాస్కరా హోటల్ యజమాని, బంగారుపాళ్యం మండలానికి చెందిన జయప్రకాష్ నాయుడు కూడా అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ పదవి కోరి భంగపడిన ఈయన, అధ్యక్ష పదవి కచ్చితంగా కావాల్సిందేనని కోరుతున్నారు.

● నగరి నియోజకవర్గానికి చెందిన పోతుల విజయ్‌బాబు కూడా అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. మద్దతుకోసం మంత్రి అచ్చెన్నాయుడితో జిల్లా ఎమ్మెల్యేలకు ఫోన్లు చేయించుకున్నట్లు తెలుస్తోంది.

● చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన వీరపల్లి హేమంబరధరావు టీటీడీ బోర్డు మెంబర్ ఆశించి భంగపడి, ఇప్పుడు అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఈయన తిరుపతిలో పారిశ్రామికవేత్తగా రాణించి ఆర్థికంగా బలపడ్డారు.

● పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన మహాదేవ సందీప్, చిత్తూరు రూరల్ మండలానికి చెందిన చంద్రప్రకాష్, చిత్తూరు నగరానికి చెందిన వసంత్‌కుమార్, ఐరాలకు చెందిన గిరి, తవణంపల్లెకు చెందిన వెంకటేష్.. ఆశిస్తున్నారు. మహదేవ సందీప్ తండ్రి మహదేవనాయుడు గతంలో జిల్లా అధ్యక్షుడిగా, టీటీడీ బోర్డు మెంబర్‌గా చేశారు. వీరంతా కమ్మ సామాజికవర్గానికి చెందినవారే కావడంతో పోటీ తీవ్రంగా ఉంది.

● మహిళా కోటాలో జీడీ నెల్లూరు నియోజకవర్గానికి చెందిన కార్జాల అరుణ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. ఈమె ప్రస్తుతం మహిళా విభాగం పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నారు. యువగళం పాదయాత్రలో అక్రమ కేసుల కారణంగా జైలుకు కూడా వెళ్లారు.

● బలిజ కోటా తెరమీదకి..

చిత్తూరు నగరానికి చెందిన కాజూరు బాలాజీ.. బలిజ కోటాలో తనకు అధ్యక్ష పదవి కావాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు.. చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు ఆరుగురిని బృందంగా చేసి ప్రచారం చేయించిన విషయం తెలిసిందే. అప్పటి ఆశావహుల్లో బాలాజీ ఉన్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో చిత్తూరు ప్రజలకు నిత్యావసరాలు, మెడికల్ అవసరాలను పంపిణీ చేసి దగ్గరైన ఈయన బలిజ కోటా తెర ముందు పెట్టి గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.

● సీనియర్ల కోటాలో..

మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ ఉన్నారు. వీరు ప్రయత్నాలు చేయడం లేదు కానీ, సీనియర్లు అని గౌరవించి అధ్యక్ష పదవి ఇస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు.

● సీఆర్ రాజన్‌ను కొనసాగిస్తే...?

అధ్యక్ష పదవి కోసం పోటీ తీవ్రంగా ఉండడంతో అర్హుల్ని ఎంపిక చేస్తారా.. లేదా ఇప్పటికే ఉన్న సీఆర్ రాజన్‌ను కొనసాగిస్తారా.. అనే ఆలోచన కూడా పార్టీ నాయకుల్లో ఉంది. ఒకే సామాజికవర్గానికి చెందిన వారు ఎక్కువ మంది ఉండడంతో వారందరినీ పక్కన పెట్టి వన్నియకుల క్షత్రియ వర్గానికి చెందిన రాజన్‌ను కొనసాగించే అవకాశాలున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఆయన్ను కొనసాగించి ప్రధాన కార్యదర్శిని మారుస్తారని చెప్పుకుంటున్నారు. రాజన్‌కు ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు, మరో పదవి ఇవ్వరని చెప్పే సీనియర్లూ ఉన్నారు. ఏదైనా సోమవారం ఓ కొలిక్కి రానుంది. త్రీమెన్ కమిటీ అభిప్రాయలను తీసుకుని సీఎం చంద్రబాబుకు అందిస్తారు.

డిజిటల్ నెర్వ్ సెంటర్ యాప్‌పై అవగాహన కల్పించాలి



రామకుప్పంలో వసతులను పరిశీలిస్తున్న విశ్వనాథ్ తదితరులు

రామకుప్పం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఏర్పాటు చేసిన టాటా డిజిటల్ నెర్వ్ యాప్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ కోరారు. శనివారం సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీతో కలిసి రామకుప్పం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు వైద్యాధికారి లోకేశ్‌తో సమావేశమై డిజిటల్ నర్వ్ యాప్‌ను ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్లాలన్న విషయమై చర్చించారు. అనంతరం ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, బీసీసెల్ నేత నాగరాజులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శనివార పూజలు



రామకుప్పం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలోని పద్మావతి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణమాసం చివరి శనివార పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ పూజారులు అమ్మవారు, శ్రీవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

చౌడేపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన చౌడేపల్లెకు చెందిన విద్యార్థులు భవ్యశ్రీ, రెడ్డిరాణిలకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు , రూ. రూ.10 వేలు నగదు పురస్కారం అందించారు. క్రెడిట్ ఆసిస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో స్కాలర్‌షిప్‌లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్, హనుమంతు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సోమల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని సోమల ఎస్‌ఐ శివశంకర వాహనదారులకు సూచించారు. శనివారం సోమల - పుంగనూరు మార్గంలోని వారపు సంత వద్ద ద్విచక్రవాహనదారులకు పలు సూచనలు చేశారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి, లైసెన్స్‌లు లేకుండా నడపరాదన్నారు. అలాగే తిరుపతి మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.

ఎరువుల దుకాణాలపై దాడులు



ఎరువుల దుకాణాల్లో సోదాలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వి.కోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేశారు. పట్టణంలోని పలు దుకాణాలకు చేరుకుని యూరియా సరఫరా, అమ్మకం పరిశీలించారు. ఇటీవల యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, ఏవో అప్పాజీ ఇతర సిబ్బంది ఉన్నారు.

బావిలోపడి వ్యక్తి మృతి



బైరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె సమీపంలోని వ్యవసాయబావిలో పడి కర్ణాటక రాష్ట్రం గుట్టహళ్లి గ్రామానికి చెందిన అశ్వత్థప్ప(40) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. ఇతడు బావిలోపడి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనంమేరకు.. గుట్టహళ్లికి చెందిన అశ్వత్థప్ప మండలంలోని పిచ్చిగుండ్లపల్లెలో తమ బంధువుల ఇంటికివచ్చి బేలుపల్లె సమీపంలోని బావిలోపడి మృతిచెందడంతో వారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. గతకొంతకాలంగా ఇతడికి మతిస్థిమితం కూడా సరిగాలేకపోవడంతో పోలీసులు జరిగిన సంఘటన గురించి వివరాలు నమోదుచేసుకున్నారు. బైరెడ్డిపల్లె ఎస్‌ఐ పరశురాముడు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

మినీ టెంపో ఢీకొని ఆవు మృతి

పెద్దపంజాణి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన మేత మేస్తున్న పాడి ఆవు, దూడలను కోళ్లను తరలించే మినీ టెంపో అదుపుతప్పి శనివారం బసవరాజుకండ్రిగ సమీపంలో ఢీకొంది. ప్రమాదంలో పాడి ఆవు అక్కడికక్కడే మృతిచెందగా దూడ తీవ్రంగా గాయపడింది. వీటి విలువ దాదాపు రూ.120 లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థులకు దంత వైద్యసేవలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అరుణ్ డెంటల్ కేర్ ఆస్పత్రి వారిచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు ఈ శిబిరంలో దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా దంతాల పరిశుభ్రత గురించి వైద్యులు వివరించారు. అలాగే పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శివసాయి, కళాశాల విభాగాధిపతులు శ్రీనివాసులు, రామకృష్ణ, మల్లప్పరాజు, ప్రవీణ్ కుమార్, చెన్నారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేట రోడ్డు విస్తరణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని కొత్తపేటను సుందరంగా, సౌకర్యవంతంగా తయారు చేయడానికి త్వరలోనే రోడ్డు విస్తరణ జరుగుతుందని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు, స్థలాలు, ఇళ్లు కోల్పోయే వారితో స్థానిక పెద్దపల్లి గంగమ్మ ఆలయ ఆవరణలో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న రాజ్ కుమార్ మాట్లాడుతూ కొత్తపేట అభివృద్ధికి అందరూ సహకరించాలని, తగిన నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, కో ఇన్‌చార్జి తిరుమగళ్, స్థానిక యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేష్, టీఎన్ఎస్ఎఫ్ మునెప్ప, బూత్ కన్వీనర్ మణి, మాజీ ఎంపీటీసీ కృష్ణన్, నాయకులు లోకేశ్, సుకుమార్, ఇర్ఫాన్, అమర్‌చంద్ర, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ బాలబాలికల షూటింగ్ బాల్ సెలక్షన్స్

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు రామకుప్పంలోని బీఆర్.అంబేద్కర్ గురుకులం పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్, పవన్ కళ్యాణ్‌లు తెలిపారు. ఇక్కడ ఎంపికకైన జట్టును సెప్టెంబరు మొదటి వారంలో జరుగబోయే రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల పోటీలకు పంపుతామన్నారు. ఇతర వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ పీటీ.వేణుగోపాల్‌ను, ఫోన్‌నంబర్ 6301831236ను సంప్రదించాలని కోరారు.

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' సాయం



సోమల కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్

సోమల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో అర్హులైన ప్రతి రైతుకు సాయం అందేలా వీర్వోలు చర్యలు తీసుకోవాని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా మొదటి విడత నిధులు రూ.7 వేలు జమ కాని రైతుల ఖాతాలను సరిచేసి ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా రైతులకు సహకరించాలన్నారు. రెగ్యులర్ సర్వేయర్ లేకపోవడంతో రైతులకు సకాలంలో పనులు చేపట్టలేక పోతున్నామని.. సచివాలయ సర్వేలు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్‌వో శ్రీనివాసులు, ఆర్ఐ సుబుక్తుల్లా, వీర్వోలు పాల్గొన్నారు.


వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ, రూరల్ మండలాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ సుబ్బరాయుడు కోరారు. శనివారం స్థానిక జేఎండీ కల్యాణ మండపంలో మున్సిపల్, గ్రామాల వినాయక మండపాల ఏర్పాటు నిర్వాహకులు, హిందూ యువత, అధికారులు, స్థానిక హిందూజాగరణ సమితి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవ యాప్‌తో మొబైల్ ఫోన్లలోనే దరఖాస్తు చేసుకుంటే పోలీసుల అనుమతి లభిస్తుందన్నారు. పుంగనూరు ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ పి.శ్రీనివాసులు, అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, హిందూ నాయకులు త్రిమూర్తిరెడ్డి, కె.బాలసుబ్రహ్మణ్యం, యువత తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎంసీ ఉద్యోగి మృతి



సురేంద్ర మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ శమిపతియాదవ్

పుంగనూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కాంట్రాక్ట్ ఉద్యోగి సురేంద్ర (48) శుక్రవారం రాత్రి పుంగనూరులో మృతి చెందారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఛాతినొప్పితో ఉండటంతో ఓ ఆస్పతికి తరలించి చికిత్సలు అందించారు. అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. ఏఎంసీ చైర్మన్ శమిపతి యాదవ్, కార్యదర్శి గోపి, కృష్ణమూర్తి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం కలిగేనా..!

● కలగా మిగిలిన బైరెడ్డిపల్లె - పేర్నంబట్ రోడ్డు



కడపనత్తం నుంచి అటవీ ప్రాంతంలో పేర్నంబట్‌కు వెళ్లేదారి



కడపనత్తం నుంచి దాదాపు 5 కి.మీ వరకు గతంలో వేసిన తారురోడ్డు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా బైరెడ్డిపల్లె మండల ప్రజలు ఎదురు చూస్తున్న అంతర్రాష్ట్ర బైరెడ్డిపల్లె - పేర్నంబట్ రహదారి నిర్మాణ పనులు జరగడం లేదు. దశాబ్దాలుగా ఈ రహదారి విషయంపై ఎవరూ పట్టించుకోవడం లేదు. బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా తమిళనాడులోని పేర్నంబట్‌కు వెళ్లాలంటే దాదాపు 25 కి.మీ దూరం ఉంది. ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే వ్యాపార రీత్యా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్ మీదుగా చెన్నైకి రైతులు పంటల ఉత్పత్తులను తరలించడానికి ఈ రహదారి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. దీంతోపాటు విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కళాశాలలకు.. వేలూరు, చెన్నై ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఈ రహదారి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. 1999-2000 మధ్యకాలంలో నాటి టీడీపీ ప్రభుత్వం రెండు విడతలుగా రూ.35 లక్షలతో పేర్నంబట్‌కు వెళ్లే రహదారిలో ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు అభివృద్ధి పనులు చేశారు. ఇందులో కొంతదూరం వరకు తారు రోడ్డు వేశారు. తమిళనాడు సరిహద్దు నుంచి పేర్నంబట్ వరకు రహదారి అధ్వానంగా ఉంది. తమిళనాడు ప్రభుత్వం దీనిపై శ్రద్ధ తీసుకుని రోడ్డు నిర్మాణపనులు చేపట్టడానికి సహకరించాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం పేర్నంబట్‌కు వెళ్లాలంటే బైరెడ్డిపల్లె నుంచి వి.కోట మీదుగా 50 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. కడపనత్తం మీదు గా రహదారి ఏర్పాటైతే కేవలం 25 కి.మీ దూ రంతో పేర్నంబట్‌కు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు చొరవ తీసుకుని రహదారి పనులు చేపట్టడానికి కృషిచేయాలని.. అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్నాం



బైరెడ్డిపల్లె -పేర్నంబట్ రహదారి నిర్మాణ పనులు జరుగుతాయని కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ దీనిపై ఆశలు చిగురిస్తున్నాయి. మండలంలోని రైతులకు ఈ రహదారి ఏర్పాటైతే చెన్నై మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తరలించడానికి సౌకర్యంగా ఉంటుంది. అలాగే బైరెడ్డిపల్లె వ్యాపార రీత్యా ఎంతో అభివృద్ధి చెందుతుంది.

- దామోదర్, కడపనత్తం

అర్జీలు ఇస్తూనే ఉన్నాం



బైరెడ్డిపల్లె - పేర్నంబట్ రహదారి ఏర్పాటు కోసం ఎన్నో ఏళ్లగా ఈ ప్రాంత పర్యటనకు వచ్చే నాయకులకు అర్జీలు ఇస్తూనే ఉన్నాం. ఎప్పుడు తమ ఆశ నెరవేరుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. బైరెడ్డిపల్లె మండలాభివృద్ధికి ఎంతో ఉపయోగకరమైన పేర్నంబట్ రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి.

- రమణప్ప, రైతుమిత్ర కన్వీనర్, కుప్పనపల్లె

అంతరిక్ష సాంకేతికతతో అగ్రగామి దిశగా భారత్



డాక్టర్ గౌరవ్ బెనర్జీని సత్కరిస్తున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశం అగ్రామిగా ఎదిగిందని కవలూరు వైను బప్పు అబ్జర్వేటరీ (వీబీవో) ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఏ) ప్రొఫెసర్ డాక్టర్ గౌరవ్ బెనర్జీ అన్నారు. కుప్పం ఇంజనీరింగు కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గౌరవ్ బెనర్జీ 'ఫ్రమ్ ఎ ఫిషింగ్ విలేజ్ టు మూన్ అండ్ మార్స్ ఇండియా' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన భారత అంతరిక్ష యాత్ర ఒక మత్స్యకార గ్రామం నుంచి మొదలై చంద్రుడు, మార్స్ సాగిన అద్భుత విజయగాథగా వర్ణించారు. ముఖ్యంగా భారత్ తన ప్రయోగాలు, విజయాలతో అంతరిక్ష సాంకేతికలో ఎలా ప్రపంచ అగ్రగామిగా పరిణమించిందో ఆసక్తికరంగా వివరించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సునీల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో విద్యార్థులకు గల ఉన్నత ఉపాధి, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల బృందం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇస్రోతో కలిసి అభివృద్ధి చేసిన 'ప్రాగ్జిమిటీ లైటెనింగ్ అలెర్ట్ సిస్టమ్' ఆధారంగా దేశంలోనే మొదటిగా మెరుపు హెచ్చరిక సాంకేతికను అందించిందని గుర్తు చేశారు. ఈ సాంకేతికత పిడుగులు పడే ప్రదేశాలను గుర్తించి ముందస్తు హెచ్చరికలు చేస్తుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వజ్రపాత్ అనే పేరుతో రూపొందించిన ఈ సాంకేతికతను ప్రశంసించారన్నారు. ఈసీఈ విభాగాధిపతి జీఎన్.కోదండరామయ్య మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కళాశాల బృందం రాష్ట్రానికి గర్వకారణమైనదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని కన్వీనర్‌గా ఈసీఈ ప్రొఫెసర్ కె.రసాదురై వ్యవహరించారు. అధ్యాపకులు పి.అజయ్ కుమార్ రెడ్డి, సంతోశ్, బి.పంజగల్, ఎంఎల్.లక్ష్మీపతి సమన్వకర్తలుగా వ్యవహరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువకు జలకళ

● పలమనేరు, కుప్పం, పుంగనూరు రైతుల్లో ఆనందం





వి.కోట: కృష్ణాపురం పంప్‌హౌస్ వద్ద కృష్ణమ్మకు పూజలు , గంగవరం : గంగ్రాజుపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువలో నీటిప్రవాహం

గంగవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంద్రీ-నీవా కాలువకు జలకళ సంతరించుకుంది. ఆరేళ్ల నుంచి బోసిపోయిన హంద్రీ-నీవా కాలువలో తాజాగా నీటి ప్రవాహం మొదలవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శనివారం వేకువజామున ఒంటి గంటకు మండలంలోని గుండుగల్లు గ్రామం వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువకు నీటి ప్రవాహం మొదలైంది. గుండుగల్లు నుంచి పసపత్తూరు వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల) వద్దకు చేరుకొంది. పసపత్తూరు వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో మోటర్లు ఆన్ చేసి నీటిని గంగ్రాజుపల్లె వైపుకు మళ్లించారు. గంగ్రాజుపల్లె నుంచి బైరెడ్డిపల్లె మండలంలోకి శనివారం వేకువజామున సుమారు 2.30 గంటలకు హంద్రీ-నీవా కాలువ జలాలు ప్రవేశించాయి. హంద్రీ-నీవా జలాలు ఒక్కసారిగా భారీ ఎత్తున ప్రవహిస్తుండటంతో పసపత్తూరు వద్ద ఐరన్ గ్రిల్‌ను ఏర్పాటు చేసి చెత్తాచెదారం లోపలకు పోకుండా తొలగించారు. పంప్‌హౌస్‌కు నీటిని తరలించారు. శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి ఒక్కసారిగా హంద్రీనీవా జలాలు ప్రవహిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● **బైరెడ్డిపల్లె :** హంద్రీ - నీవా జలాలు శనివారం బైరెడ్డిపల్లె మండలం తీర్థం, ఎం.కొత్తూరు వద్దకు చేరుకున్నాయి. కాలువలో ప్రవహిస్తున్న నీటిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

అడుగడుగునా జలహారతులు

వి.కోట మండలానికి హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీరు రావడంతో మండల పరిధి రైతులు, ఇతర వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలు అడుగడుగునా కృష్ణమ్మకు జలహారతులు పడుతున్నారు. నెర్నపల్లె వద్ద వేలాదిగా చేరుకున్న జనం అక్కడ గంగమ్మకు జలహారతులు ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో హారతులు ఇచ్చారు.



వి.కోట: నెర్నపల్లె వద్ద జలహారతులు ఇస్తున్న టీడీపీ నేతలు

చెత్త నుంచి సంపద సృష్టించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

రొంపిచెర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి చెత్త సేకరించి సంపద సృష్టించి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని మండల పరిషత్ పరిపాలనా అధికారి రెడ్డెప్పఆచారి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గానుగచింత, నగిరి, జగడం వారిపల్లె, కట్టామాదిగపల్లె, దాసరిగూడెం గ్రామాల్లో ఆరోగ్య, పంచాయతీ, టీడీపీ నాయకులతో కలిసి పారిశుధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ముద్దుకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత తహసీల్దారుపై యువకుల దాడి

పుంగనూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో గట్టిగా మాట్లాడితే బస్సులోని ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుందని సూచించిన విశ్రాంత తహసీల్దార్‌పై ముగ్గురు యువకులు శనివారం పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో దాడి చేశారు. బాధితుని కథనం మేరకు... కడపకు చెందిన విశ్రాంత తహసీల్దార్ అంజాద్‌హుసేన్(70) మదనపల్లె నుంచి ఆర్టీసీ బస్సులో పుంగనూరు తహసీల్దార్ రామును కలవడానికి బయలుదేరారు. బస్సులో పక్కనే పలమనేరుకు చెందిన నౌషాద్ కుమారుడు వెల్డర్ షేక్షాన్ (28) ఫోన్‌లో గట్టిగా మాట్లాడుతుండగా అలా మాట్లాడకండని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తహసీల్దాం కార్యాలయంలోకి వెళ్లిన విశ్రాంత తహసీల్దార్ అంజాద్ హుసేన్‌పై షేక్షాన్‌తో పాటు మరో ఇద్దరు ఆయనపై దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆహ్లాదకరమైన పరిసరాల నుంచే మంచి ఆలోచనలు : ఏఎస్పీ



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చుట్టూ ఆహ్లాదకరమైన పరిసరాలుంటే.. అందులో నుంచి మంచి ఆలోచనలు పుడతాయని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛతాదివస్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేత స్వచ్ఛతాదివస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోలీసు కార్యాలయం, పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ఏఎస్పీ (ఆపరేషన్) శివానంద కిశోర్‌తో కలిసి ఆయన మొక్కలునాటి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, ఆర్‌ఐలు సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణలో భాగంగా మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెనింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈషాలో ఘనంగా గ్రామోత్సవం

తవణంపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరగొండ అపోలో ఈషా పాఠశాలలో శనివారం 17వ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా త్రోబాల్, వాలీబాల్, కుర్చీల ఆట, గోనె సంచి, నృత్య ప్రదర్శన, రంగోలి తదితర పోటీలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన మహిళలు 18జట్లుగా పోటీల్లోపాల్గొనగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 21 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గత రెండ్రోజులుగా ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించి, మద్యం తాగి వాహనాలను నడిపిన 21 మందిని పట్టుకుని కేసు నమోదు చేశారు. శనివారం వారిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసును పరిశీలించిన జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.2.10లక్షల జరిమానా విధించారు.

మరో 17 మందికి..

గత రెండ్రోజులుగా రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ కార్యక్రమాలను నిర్వహించినట్లు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడిపిన ముగ్గురిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 14మందిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని శనివారం కోర్టులో హాజరుపరిచగా, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కేసును పరిశీలించి మద్యంతాగి వాహనాలను నడిపిన ముగ్గురికి చెరో రూ.10వేలు చొప్పున రూ.30వేలు, బహిరంగప్రదేశాల్లో మద్యంతాగిన 14మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.14వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

28 లోపు రిజిస్ట్రేషన్లు చేసుకోండి

చిత్తూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 31న జరగనున్న ఏపీ స్టేట్ ఓపెన్ టెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 28వ తేది లోపు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 98493 13676, 90004 75799 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీసుల సూచన మేరకే మండపాల ఏర్పాటు

చిత్తూరు సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలీసుల సూచనమేరకు వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకోవాలని చిత్తూరు నగర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు సూచించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న వినాయక చవితి సందర్భంగా నగరంలో మండపాలు ఏర్పాటు చేయనున్న నిర్వాహకులు మండపాల వద్ద పోలీసుశాఖ నియమ నిబంధనలను పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో నగర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు రామభద్ర, హరిప్రసాద్, షణ్ముగం, వెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

నగరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నగరి ఆర్డీవో అనుపమ సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో వుంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి ఆమె అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, నగరి ఆర్డీవో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

యాదమరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు స్ఫూర్తి వచనాలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమయాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పే మాటలను గమనించి ఆచరించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకుమందలో కార్డన్‌సెర్చ్

బంగారుపాళ్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమందలో శనివారం ఉదయం సీఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పలు అనుమానిత ఇళ్లు, అంగళ్లతో పాటు వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ఎవరైనా అనుమానితులు ఉంటే సమాచారం ఇవ్వాలని, గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితిని నిర్వహించేందుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని చెప్పారు.



శుభ్రతతోనే వ్యాధులు దూరం: మేయర్



విద్యార్థులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధుల బారిన పడకుండా ఉండగలమని నగర మేయర్ అముద చెప్పారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగర పరిధిలోని మాన్‌సూన్ హైజీన్ అంశంపై ప్రత్యేక అవగాహన, ర్యాలీ, దోమల నియంత్రణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇన్‌చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు. స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మేయర్ పాల్గొని మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నగరపాలక అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, స్థానికులు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. చామంతిపురంలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. నగర పరిధిలోని అన్ని వార్డుల్లో ర్యాలీలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీటి ప్రవాహం



గురుగునత్తం రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

గుడిపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని మారుమూల ప్రాంతమైన నంగమంగళం పంచాయతీ గురుగునత్తం రైల్వే బ్రిడ్జి కింద శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామస్తుల రాకపోకలు స్తంభించాయి. కాగా, కోటూరులో కురిసిన వర్షానికి చేమ గడ్డల పంట పూర్తిగా నీటి మునిగిపోయిందని రైతు వాసురెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

అక్షరాంధ్ర వలంటీర్లకు శిక్షణ



సూచనలిస్తున్న ఏపీఎం కవిత

వెదురుకుప్పం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 1850 మంది చదువు రాని మహిళలను గుర్తించి, వారిలో 185 మంది వలంటీర్లను ఎంపిక చేశారు. వందరోజుల్లో చదువు నేర్పించే విధంగా కార్యక్రమం చేపట్టారు. ఏపీఎం కవిత, ఏపీవో కిరణ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు బియ్యం తక్కువగా వస్తున్నాయి

● డీలర్ల ఆవేదన

గంగాధరనెల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు సివిల్‌సప్లయ్స్ గోడౌన్‌లో డీలర్ల ముందే తూకం వేసి లారీకి వేస్తారు సరే.. ఆ తర్వాత రేషన్‌షాపుల్లో ఆ స్టాకు దించి కార్డుదారులకు బియ్యం వేసేశాక కొన్ని కార్డులకు తక్కువ (షార్టేజ్) ఎలా వస్తుందో అర్థం కావడంలేదని పలువురు డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్ మహేష్ అధ్యక్షతన రేషన్‌షాపు డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు డీలర్లు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ మహేష్ మాట్లాడుతూ రేషన్ సరుకులు తూకాల్లో తేడా రాకుండా ప్రణాళిక ప్రకారం అందిస్తామన్నారు. కార్డుదారులకు సక్రమంగా అందించాలని కోరారు. గోడౌన్ డీటీ కరుణాకర్‌రెడ్డి, ఆర్‌ఐ ఏకాంబరం, మండల రేషన్‌షాపు డీలర్ల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి రూ.2 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి యాదమరి మండలం కుక్కలపల్లెకు చెందిన పోలా సుబ్రహ్మణ్యం రూ.1,01,116 చెక్కు రూపంలో, తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డికి చెందిన శివశంకరి రూ.1,00,000 విరాళంగా శనివారం అందించారు. విరాళదాతలను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



త్యాగరాజన్‌కు స్వీట్లు తినిపిస్తున్న తెలుగుమహిళలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన త్యాగరాజన్‌ను తెలుగుమహిళలు ఘనంగా సన్మానించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో త్యాగరాజన్‌ను దుశ్శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెలుగుమహిళలు అరుణ, అనురాధ, జమున, దుర్గ, బుజ్జీరావు, అనిత, సుభాషిణి, విజయ, పద్మ, వనజ, కవిత, దేవి, పుష్ప, భవ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న సర్పంచ్, వైస్ సర్పంచ్

బంగారుపాళ్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విధుల్లో అంకితభావంతో పనిచేసి స్వాతంత్ర్య దినోత్సం నాడు మంత్రి సత్యకుమార్‌చే ప్రశంసాపత్రం అందుకున్న బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులును, బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉమాదేవి క్రిష్ణమూర్తి, వైస్ సర్పంచ్ కామరాజు శనివారం దుశ్శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

షాపును ఢీకొట్టి వ్యక్తి మృతి



మృతిచెందిన అశోక్‌కుమార్

గంగాధరనెల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బైక్‌పై అతివేగంతో వస్తూ అదుపుతప్పి ఓ షాపుగోడను ఢీకొట్టి అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున గంగాధరనెల్లూరులో జరిగింది. గంగాధరనెల్లూరు ఏఎస్‌ఐ దామోదరం కథనం మేరకు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్(28) గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు పంచాయతీ పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతడు మండలంలోని అగరమంగళం గ్రామానికి వెళ్లి తోటి కార్మికుడైన క్రిష్ణకుమార్‌ను బైక్‌పై ఎక్కించుకుని శనివారం తెల్లవారుజామున వేల్కూరు అతివేగంగా వస్తుండగా గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలికి సమీపంలో గల ఓ షాపు గోడను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, క్రిష్ణకుమార్ ఎటువంటి గాయాలు లేకుండా ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం గురించి వేల్కూరు గ్రామానికి చెందిన మాధవరెడ్డి గంగాధరనెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశోక్‌కుమార్ మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పింఛన్లపై రీ వెరిఫికేషన్



జనంతో కిక్కిరిసిన ఎంపీడీవో కార్యాలయం

యాదమరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యాదమరి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలో వికలాంగుల కోటాలో పింఛన్లు కోల్పోయిన వారికి శనివారం వైద్యులచే రీవెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయానికి భారీసంఖ్యలో వికలాంగులు, వారి సహాయకులు, ప్రజలు, నాయకులు పెద్దఎత్తున తరలిరావడంతో రద్దీ పెరిగి గందరగోళం నెలకొంది. పలువురు బెడ్ రిడన్ పేషెంట్లు ఎంపీడీవో కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి వాహనాల్లోనే వైద్యపరీక్షలు నిర్వహించారు. మాదిరెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో వైద్యులు మొదటి అంతస్తులో పరీక్షలు చేపట్టడంతో అక్కడికి చేరుకోవడానికి అవస్థలు పడ్డారు. ఎంపీడీవో వేణు, వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షులు మురళి మాట్లాడుతూ పూర్తి అర్హులైన వికలాంగులకు చేయూతనిచ్చి సక్రమంగా తనిఖీలు చేయాలని అధికారులను కోరారు. కొందరు అనర్హులు పింఛన్లు పొందుతున్నారని, వారిని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీడీవో వేణు, వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, వరప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి



సుధీర్ కుమార్ మృతదేహం

తవణంపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అరగొండలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ చిరంజీవి కథనం మేరకు మండలంలోని అరగొండ గ్రామం యాదవవీధికి చెందిన ఉమాపతి కుమారుడు సుధీర్‌కుమార్(31) తిరుపతిలో డ్రైవర్‌గా పని చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. అక్కడ పలువురు వద్ద అప్పులుచేసి తిరిగి కట్టలేక గత మూడు నెలలుగా తన స్వగ్రామమైన అరగొండ చేరుకొని ఖాళీగా ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం సుధీర్ తన భార్యతో గొడవపడ్డాడు. దీంతో సుధీర్ భార్య తన ఇద్దరు పిల్లలను ఇంట్లో వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోవడంతో చేసిన అప్పులు కట్టలేక జీవనోపాధి లేక మనస్థాపంతో శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సుధీర్ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బిహార్ కూలీ మృతిపై విచారణ

బంగారుపాళ్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో ఈ నెల 21వ తేదీన బిహార్‌కు చెందిన కూలీ బ్రిడ్జిపై నుంచి పడి తలకు తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన విదితమే. శనివారం సీఐ కత్తి శ్రీనివాసులు, చిత్తూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనంద్‌బాబు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు బబ్లుకుమార్ ఆధార్, సర్టిఫికెట్లు పరిశీలించి, అతడు మైనర్ బాలుడని నిర్ధారించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు ఆనంద్‌బాబు తెలిపారు.

రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని మృతదేహం

పూతలపట్టు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలం ఎం.బండపల్లి సమీపాన గల రైల్వేట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. శనివారం సాయంత్రం తిరుపతి నుండి కాట్పాడి వైపు వెళ్తున్న రైలు నుండి ఆకస్మాత్తుగా కిందపడి మృతిచెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇతని వయస్సు సుమారు 46 సంవత్సరాలు ఉండొచ్చని, నీలి రంగు షర్టు, ఎరుపు రంగు ప్యాంటు ధరించివున్నాడు. మృతదేహాన్ని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ పరిశీలించారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసం

యాదమరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో పిడుగు పడి ఓ ఇంటి గోడలకు పగుళ్లు ఏర్పడి, ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయి. శుక్రవారం రాత్రి మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పెరియంబాడి దళితవాడకు చెందిన జ్ఞానశేఖర్ ఇంటి పైభాగంలో ఉన్న టెంకాయ చెట్టు మీద భారీ పిడుగు పడిన క్రమంలో ఇంటి గోడలకు నెర్రెలు చీలి, విద్యుత్ సరఫరా వైర్లు కాలిపోయాయి. టీవీ, ఫ్రిజ్, పరికరాలు దెబ్బతినటంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని తహసీల్దార్ పార్థసారథికి బాధితుడు ఫిర్యాదుచేశాడు. దెబ్బతిన్న ఇంటిని వీఆర్వో సుబ్బులక్ష్మి పరిశీలించి నివేదికను అధికారులకు పంపనున్నట్లు తెలిపారని బాధితుడు చెప్పాడు.

ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి అదుపుతప్పిన బస్సు



పాలసముద్రం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి కర్ణాటక ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బలిజకండ్రిగ నుంచి బెంగళూరుకు శనివారం మధ్యాహ్నం బయలుదేరిన కర్ణాటక ఆర్టీసీ బస్సు డ్రైవర్ పాలసముద్రం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో, బస్సు అదుపుతప్పి పక్కకు ఒరిగి పోయింది. అదే ప్రాంతంలో ఓ చింతచెట్టు ఉండటంతో బస్సు దానికి ఆనుకుని నిలిచిపోయింది. దీంతో ప్రయాణీకులు హాహాకారాలు చేశారు. చింత చెట్టు లేకపోయి ఉంటే బస్సు బోల్తా పడేది. చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి వాసునాయుడు జేసీబీని రప్పించి ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సును యథాస్థానంలో ఉంచి బెంగళూరు పంపించారు. ద్విచక్ర వాహనదారుడు రాంగ్ రూట్‌లో వచ్చినందున ఈ ప్రమాదం జరిగింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లీబిడ్డను కాపాడిన పోలీసులు

యాదమరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లీకుమారుడిని పోలీసులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రసూల్ నగర్‌కు చెందిన ఓ మహిళ (25) తన మూడేళ్ల బిడ్డను తీసుకుని శనివారం మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లిపోయింది. తన కూతురు రైల్వే ట్రాక్ వద్ద నిలబడి ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను వెతకవద్దంటూ వాట్సప్‌లో ఫొటోలు పెట్టిందని ఎస్‌ఐ ఈశ్వర్‌కు ఆమె తండ్రి ఫిర్యాదుచేశాడు. దీంతో స్పందించిన ఎస్‌ఐ, సిబ్బంది ఆమె మొబైల్‌ను ట్రాక్‌చేయగా తిరుపతి పట్టణ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు కనుగొన్నారు. ఎస్‌ఐ ఆమెకు ఫోన్‌చేసి ఒకపక్క మనోధైర్యాన్ని కల్పిస్తూనే మరోపక్క తిరుపతి రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. వారు చాకచక్యంగా వ్యవహరించి తల్లీబిడ్డను కాపాడారు. అనంతరం వారిని యాదమరి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

15 గ్రాముల బంగారం చోరీ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ దొంగ బంగారాన్ని తీసుకెళ్లిపోయాడు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. లాయర్స్‌కాలనీలో రామచంద్రుడు భార్యతో కలిసి నివాసముంటున్నారు. రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి కలకడలోని బంధువు ఇంటికి వెళ్లారు. శనివారం వచ్చి చూడగా ఇంటి కిటికీ కమ్మీని తీసేసినట్లు కనపడటంతో లోనికివెళ్లి చూశారు. బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారు నగలను తీసుకెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆదర్శ పాఠశాలకు కంప్యూటర్ వితరణ

విజయపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి వరదరాజు చెంచురాజు కంప్యూటర్‌ను శనివారం వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకమరాజు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ చిన్నపాపయ్య, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

పూతలపట్టు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగుచింతలో 10 రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణ జయంతి వేడుకలు శనివారంతో ముగిశాయి. స్వామివారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, శాంతి హోమం నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని పుష్పపల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.